# ప్రజాశక్తి

మంగళవారం 11 ఏప్రిల్ 2023

5

## ఇటుకల పండగ

**ప్రజాశక్తి- పెదబయలు:** మండలంలోని పలు గ్రామాల్లో ఇటుకల పండుగ సందడి నెలకొంది. వారపు సంతల్లో రహదారికి అడ్డంగా దట్టమైన తాడు, బలమైన కర్రతో అడ్డగించి సాంప్రదాయ బద్దంగా నుదుటిపై బియ్యపు బొట్టు ఫెట్టి చందాలు అడుగుతున్నారు. ఈ చందాలతో చివరి రోజున పండగను చేసుకుంటారు. ఈ పండుగ రోజుల్లో గిరిజనులు థింసా నృత్యాలతోఆనందంగా గడుపుతారు.

చందాలు వసూలు చేస్తున్న గిరిజను మహిళలు

# డి ఫారం పట్టాల పంపిణీకి ఏర్పాట్లు

## జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

**ప్రజాశక్తి-పాడేరు:** జిల్లాలో జగనన్న శాశ్వత భూ హక్కు భూరక్ష పథకానికి అత్యంత ప్రాధాన్యత ఇచ్చి రీ సర్వే లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని, డిఫారం పట్టాల పంపిణీకి ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ అధికారులను ఆదేశించారు. డి ఫారం పట్టాలు పంపిణీ, భూముల రీ సర్వే, పివిటిజి ఓటర్ల నమోదు ప్రక్రియ పై అధికారులతో కలెక్టర్ కార్యాలయం నుండి సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతులకు డి ఫారం పట్టాలు పంపిణీకి రెవెన్యూ అధికారులు సన్నద్ధం కావాలని స్పష్టం చేసారు. ఇప్పటికే ఎస్సైన్‌మెంట్ కమిటీ ప్రొసీడింగ్ ఇవ్వడం జరిగిందన్నారు. ఏ సమయం లోనైనా ఎస్సైన్‌మెంట్ కమిటీ సమావేశం జరగవచ్చని చెప్పారు. ఎస్సైన్‌మెంట్ కమిటీ వేసే ప్రశ్నలకు తహశీల్దారులు సమాధానాలు చెప్పవలసి ఉంటుందన్నారు. గిరిజన రైతులు డి ఫారం పట్టాల కోసం విఆర్‌ఓలను, తహశీల్దారులను సంప్రదించాలని సూచించారు. గిరిజన రైతులకు మాత్రమే డి ఫారం పట్టాలు అందించడానికి భూములు గుర్తించాలన్నారు. డి ఫారం పట్టా భూములు వెబ్‌ల్యాండ్‌లో నమోదు చేస్తే రైతు భరోసా, పంటల రాయితీలు పొందడానికి అవకాశం ఉంటుందన్నారు. రీ సర్వేలో సబ్ డివిజన్ పెండింగ్ ఉండకూడదన్నారు. వచ్చే నెల 10వ తేదీ నాటికి మ్యుటేషన్ పూర్తి చేయాలని సూచించారు. ఫారం 7 పత్రాలను ఎంపిడిఓల నుండి సేకరించి వచ్చే 10 రోజుల్లో స్థానిక ప్రజా ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించాలని చెప్పారు. అర్హులైన ప్రతీ పివిటిజికి ఓటరు గుర్తింపు కార్డు ఉండాలని చెప్పారు. పివిటిజి ఓటరు నమోదు పక్కాగా జరగాలన్నారు. ఆదాయ ధృవీకరణ పత్రాలు, అడంగల్ పత్రాలు, ఫ్యామిలీ సర్టిఫికేట్ల జారీ వేగంగా పూర్తి చేయాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ జె. శివ శ్రీనివాసు, సబ్ కలెక్టర్ వి.అభిషేక్, డిఆర్‌ఓ పి.అంబేద్కర్, ల్యాండ్ సర్వే సహాయ సంచాలకులు వై. మోహనరావు, తహశీల్దారులు, సర్వేయర్లు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్

## దరఖాస్తుల స్వీకరణ

**ప్రజాశక్తి- పెదబయలు:** స్థానిక బాలుర రెసిడెన్షియల్ పాఠశాలలో ఆగస్ట్, సెప్టెంబర్ నెలల్లో దక్షిణ భారత హిందీ ప్రచార సభ ఆంధ్ర నిర్వహించే ప్రాథమిక నుండి రాష్ట్ర భాష ప్రవీణ వరకు జరిగే పరీక్షలకు ఆసక్తి ఉన్న వారు దరఖాస్తులు చేసుకోవాలని హిందీ ప్రచారక్ పి ఫాల్గుణ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు ఫోన్:9493531174 కు సంప్రదించాలని తెలిపారు. హిందీ కోర్సు సర్టిఫికేట్‌తో ఉపాధి పొందే అవకాశాలు ఉన్నాయన్నారు. పదవ తరగతి పూర్తి చేసిన అభ్యర్థులు నేరుగా ప్రవేశిక పరీక్ష రాయవచ్చన్నారు.

అవార్డు స్వీకరిస్తున్న కలెక్టర్, పిఒ

## ఐటిడిఎకు ఉత్తమ పురస్కారం

**ప్రజాశక్తి-పాడేరుటౌన్:** ఐటిడిఏకు ఐఎస్ఓ 9001 - 2015 ఉత్తమ పురష్కారం లభించింది. జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, ఐటిడిఏ పిఓ రోణంకి గోపాల క్రిష్ణ సోమవారం కలెక్టర్ చాంబర్‌లో ఐఎస్ఓ సర్టిఫికేట్‌ను సంస్థ ఎండి శివయ్య చేతుల మీదుగా స్వీకరించారు. కార్యాలయం నిర్వహణలో నాణ్యతలు పాటించడం, గిరిజనాభివృద్ధి, ఉత్తమ వైద్య సేవలు, విద్యా ప్రమాణాలు, మెరుగైన జీవనోపాదుల కల్పన, గృహ నిర్మాణాలు, విద్యుదీకరణ, తాగునీటి సౌకర్యాల కల్పన వంటి రంగాలలో పాటిస్తున్న నాణ్యతా ప్రమాణాలపై సంతృప్తి చెంది హెచ్‌వైఎం ఇంటర్నేషనల్ సర్టిఫికేషన్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఐఎస్ఓ సర్టిఫికేషన్ జారీ చేసింది. గతంలో గిరిజన సహకారం సంస్థ, గిరిజన సంక్షేమ శాఖకు ఐఎస్ఓ సర్టిఫికేషన్ జారీ చేసామని ఐఎస్ఓ ఎండి. శివయ్య తెలియ జేసారు. రెండు తెలుగు రాష్టాలలో పాడేరు ఐటిడిఏకు ఐఎస్ఓ సర్టిఫికేట్ లభించిందన్నారు. అన్ని రకాల నాణ్యతా ప్రమాణాలు ఆడిట్ చేసిన తరువాత ఐఎస్ఓ సర్టిఫికేట్ ఇస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఏ సహాయ ప్రాజెక్టు అధికారులు విఎస్ ప్రభాకర రావు, ఎం.వేంకటేశ్వరరావు, గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు ఐ.కొండలరావు, ఇఇ డివిఆర్ఎం రాజు, పరిపాలనాధికారి హేమలత, డిఇఇ అనుదీప్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం

## రాజకీయ ప్రచార భేరిని జయప్రదం చేయండి

### సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం

**ప్రజాశక్తి -కూనవరం**

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రాష్ట్రానికి చేసిన ద్రోహానికి వ్యతిరేకంగా ఈ నెల 14 నుంచి 30వ తేదీ వరకు సిపిఎం, సిపిఐ ఆధ్వర్యాన నిర్వహించనున్న రాజకీయ ప్రచార భేరిని జయప్రదం చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని మార్త శ్రీరామ్మూర్తి భవన్‌లో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వరరావు అధ్యక్షతన సోమవారం జరిగిన పార్టీ మండల కమిటీ సమావేశంలో మంతెన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల ముందు ఉంచడం కోసం ఈ పొలికల్ క్యాంపెయిన్ చేపట్టినట్లు చెప్పారు. కూనవరం మండలంలోని అన్ని గ్రామాలలో సిపిఎం, సిపిఐ కార్యకర్తలు కలిసి ప్రచార కార్యక్రమం చేపట్టాలన్నారు. పోలవరం ముంపు నిర్వాసితుల విషయంలో కేంద్ర ప్రభుత్వం తన బాధ్యతను మరిచి వ్యవహరిస్తుందని విమర్శించారు. పోలవరం నిర్వాసితులకు న్యాయం జరిగే వరకు సిపిఎం వారికి అండగా ఉండి పోరాటం చేస్తుందని చెప్పారు. ఈ సమావేశంలో సిపిఎం ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్, మండల కార్యదర్శి పాయం సీతారామయ్య, నాయకులు పాయం సత్యనారాయణ, బాబు బొర్రయ్య, కర్నాటి శ్రీనివాసరావు, తాళ్లూరి శ్రీనివాసరావు, తెల్లం తమ్మయ్య, పాయం జ్యోతి, సర్పంచ్ వెంకమ్మ, ఎంపీటీసీ జయసుధ, వెంకన్న వెంకటేశ్వరావు, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

# హత్య కేసులో 14 మంది నిందితుల అరెస్టు

## -భూ తగాదాలతోనే హత్య చేసినట్టు నిర్ధారణ - సిఐ దేముడుబాబు

**ప్రజాశక్తి- అరకురూరల్:** డుంబ్రిగూడ మండలంలోని కితలంగి పంచాయతీ వయా గ్రామంలో ఈనెల 3 న హత్య చేసి సజీవ దహనానికి పాల్పడిన 14 మంది నిందితులను అరెస్టు చేసినట్లు అరకు సీఐ జి.దేముడు బాబు చెప్పారు. ఆయన అరకులోయలో విలేకరులకు వివరాలు వెల్లడించారు.హత్య చేసిన నిందితులు, మృతుడు జి.గోవింద్ ఒకే కుటుంబానికి చెందిన వారన్నారు. వయా గ్రామ రెవెన్యూ పరిధి సర్వే నెంబర్ 17 -2లో గెడ్డ పక్కన ఉన్న ఒక ఎకరం భూమిపై తాత ముత్తాతల నుంచి గొడవలు జరుగుతూనే ఉండేవన్నారు.హత్యకు పాల్పడిన నిందితుల పేరు మీద ఆ భూమికి సంబంధించి పట్టా ఉందని, మృతుడు గోవింద్ కుటుంబ సభ్యులు పూర్వీకుల నుండి సాగు చేస్తున్నారన్నారు. దీంతో మృతుడు కుటుంబీకులు సాగు చేస్తున్న భూమిని తమకు అప్పగించాలని చెప్పగా మృతుడు గోవింద్ వారితో గొడవలకు దిగి ఆ భూమి ఇచ్చేది లేదని తెలిపాడు. నెల రోజులు క్రితం మతుడు గోవిందు వయా గ్రామంలోని ఉన్న ఆ ఎకరం భూమిని గవర్నమెంట్ రిసర్వేలో భాగంగా సర్వేయర్ తో తన పేరు మీద సర్వే చేయిస్తుండగా అక్కడికి నిందితులు చేరుకొని ఆ భూమి తమకు వస్తాదని తెలిపారు. ఈనెల 2న పింపాలగూడ గ్రామంలో గోవింద్ తమ భూమి జోలికి ఎవరైనా వస్తే చంపేస్తానని గ్రామంలో చెప్పుకొని తిరిగినట్లు తెలిసిందన్నారు. చంపుతాానంటూ తిరుగుతుండడంతో అతని నుంచి ఎప్పటికైనా మనందరికీ ప్రాణహాని ఉండవచ్చని భయపడి, నిందితులంతా అతడిని హత్య చేసేందుకు పథకం పన్నారు. పశువులు కాస్తూ చెట్టు కింద సేద తీరుతున్న సమయంలో గోవిందు పై కర్రాలు, గొడ్డళ్ళతో దాడి చేసి హత్య చేసిన తర్వాత పెట్రోల్ పోసి తగుల బెట్టినట్లు దర్యాప్తులో తేలిందన్నారు. ఈ హత్యకు పాల్పడిన (14)మంది నిందితులను అరెస్టు చేశామన్నారు .వీరిలో గొల్లోరి లోకినాద్, గొల్లోరి సోమరాజు, గొల్లోరి సుబ్బారావు, గొల్లోరి బలరాం, గొల్లోరి గణేష్, గొల్లోరి చిట్టిబాబు, గొల్లోరి గురుమూర్తి, గొల్లోరి ప్రసాద్, గొల్లోరి రాంబాబు, గొల్లోరి జలంధర్, గొల్లోరి అప్పలమ్మ , గొల్లోరి కమల, గొల్లోరి దానిమ్మతో పాటు మైనర్ బాలుడు ఉన్నారని అన్నారు. వీరికి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డుంబ్రిగుడ గూడ ఎస్ఐ సంతోష్ కుమార్, అరకులోయ ఎస్ఐ సతీష్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిఐ దేముడుబాబు

గర్భిణుల సీతమంతం కార్యక్రమంలో పాల్గొన్న విజయప్రతాప్‌రెడ్డి

కురుస్తున్న వర్షం

## పాడేరులో భారీ వర్షం

### జన జీవనానికి అంతరాయం

**ప్రజాశక్తి-పాడేరుటౌన్:** అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులో సోమవారం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండ వాతావరణం కొనసాగి, ఆ తర్వాత వాతావరణం మారిపోయింది. మధ్యాహ్నం మూడున్నర గంటల తర్వాత ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. గంటసేపు కురిసిన వర్షానికి పాడేరు పట్టణం తడిచి ముద్దయింది. భారీగా వర్షం కురవడంతో జనజీవనానికి అంతరాయం ఏర్పడింది. అలాగే దూర ప్రాంతాల్లో పిడుగులు పడిన శబ్దాలు వినిపించాయి. ఉరుములతో కూడిన వర్షం పడడంతో జనం ఆందోళనకు గురయ్యారు. భారీ వర్షానికి పట్టణంలోని రోడ్లు వీధులు జలమయమయ్యాయి. చిరు వ్యాపారులు, వీధి వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వాహనదారులు లైట్లు వేసుకుని ప్రయాణాలు సాగించారు.

మరమ్మతుకు గురైన అంబులెన్స్

### మరమ్మతుల బారిన

## ఫీడర్ అంబులెన్సు

**ప్రజాశక్తి -డుంబ్రిగూడ:** రోడ్డు సౌకర్యం లేని మారుమూల గ్రామాలో సైతం సకాలంలో వైద్య సేవలు అందించేందుకు గాను ప్రభుత్వం ఐటీడీఏ ఆధ్వర్యంలో పీడర్ అంబులెన్స్‌లను ఏర్పాటు చేసింది. ఈ అంబులెన్స్ ప్రారంభించి సుమారు ఐదేళ్లు పైబడి గడుస్తుండటంతో మరమ్మతుకు గురవుతున్నాయి. మండల కేంద్రంలోని ప్రాథమిక డుంబ్రిగూడ ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన పిడర్ అంబులెన్స్ మరమ్మతుకు గురవ్వడంతో మెకానిక్ షాపుకు పీడర్ అంబులెన్స్ పైలెట్ తోసుకుని వెళ్లి మరమ్మతు చేయించారు. అంబులెన్స్‌ను ఎప్పటికప్పుడు మరమ్మతు చేసి అందుబాటులో ఉంచాల్సిన అధికారులు నిర్లక్ష్యం చేయడంతో గిరిజనులకు సకాలంలో వైద్య సేవలు అందని పరిస్థితి నెల కొంటుందని గిరిజనులు అంటున్నారు. ఇప్పటికైనా ఐటిడిఏ స్పందించి పీడర్ అంబులెన్సులను ఎప్పటికప్పుడు మరమతు చేసి అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని గిరిజనులు కోరుతున్నారు.

# ఆరని నిరసన సెగలు

- ★ ఎమ్మెల్యే ధనలక్ష్మిని అడ్డుకున్న ఆదివాసీలు
- ★ సుమారు గంట పాటు రోడ్డుపై బైఠాయింపు
- ★ బోయ వాల్మీకిలను ఎస్‌టి జాబితాలో చేర్చడంపై రాజీనామా చేయాలని డిమాండ్

ఎమ్మెల్యే ధనలక్ష్మిని చుట్టుముట్టిన గిరిజన నాయకులు, ఆదివాసీలు

**ప్రజాశక్తి -మారేడుమిల్లి**

బోయ, వాల్మీకి, బెంతు, ఒరియాలను ఎస్‌టి జాబితాలో చేర్చాలని రాష్ట్ర అసెంబ్లీలో చేసిన తీర్మానంపై ఏజెన్సీలో నిరసన జ్వాలలు రగులుతూనే ఉన్నాయి. రంపచోడవరం ఎమ్మెల్యే నాగులాపల్లి ధనలక్ష్మి నియోజకవర్గంలో ఎక్కడికి వెళ్లినా గిరిజనుల నుంచి నిరసనలు తప్పడం లేదు. సోమవారం మండల కేంద్రంలో ఆసరా పథకం సభకు విచ్చేసిన ఎమ్మెల్యే ధనలక్ష్మిని పోలీస్ స్టేషన్ కూడలి వద్ద గిరిజన సంఘం, ఆదివాసీ జెఎసి ఆధ్వర్యాన గిరిజనులు అడ్డుకున్నారు. సుమారు గంటకుపైగా రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. ఎమ్మెల్యే గో బ్యాక్, జై ఆదివాసీ అనే నినాదాలతో మండల కేంద్రం మారుమోగింది. అసెంబ్లీలో బోయ వాల్మీకి, బెంతు ఒరియా కులాలను ఎస్టీ జాబితాలో చేర్చాలన్న అసెంబ్లీ తీర్మానానికి అనుకూలంగా వ్యవహరించిన గిరిజన ఎమ్మెల్యే ధనలక్ష్మి వెంటనే రాజీనామా చేసి ప్రజల తరపున పోరాటంలోకి రావాలని డిమాండ్ చేశారు. జిఓ నెంబర్ 52ను ఉపసంహరించుకునే విధంగా రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని కోరారు. ఇప్పటికే షెడ్యూల్ ఏరియాలో విద్య, ఉద్యోగాల్లో ఆదివాసీలు తీవ్రంగా నష్టపోతున్నారని, ఇటువంటి పరిస్థితుల్లో కొత్తగా బోయ, వాల్మీకి, బెంతు, ఒరియాలను ఎస్‌టి జాబితాలో చేర్చితే గిరిజనులు మరింత నష్టపోతారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే ధనలక్ష్మి మాట్లాడుతూ ఈ తీర్మానం గత టిడిపి ప్రభుత్వం ప్రవేశపెట్టిందని, దానిని మళ్లీ ఇప్పుడు తీర్మానం చేయడం జరిగిందని చెప్పారు. బెంతు ఒరియా, బోయ వాల్మీకి కులాలు నాలుగు జిల్లాల్లో మాత్రమే ఉన్నారని, వారి వలన మనకు ఎటువంటి నష్టం లేదని చెప్పారు. దీంతో గిరిజన సంఘం జిల్లా నాయకులు ఈతపల్లి సిరిమల్లిరెడ్డి జోక్యం చేసుకొని తెలంగాణలో లంబాడీలను ఎస్‌టి జాబితాలో చేర్చడం వల్ల అక్కడి గిరిజనులు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కోల్పోయారని, అటువంటి పరిస్థితి ఆంధ్రప్రదేశ్‌లో పునరావృతం అవుతుందని పేర్కొన్నారు. ఇప్పటికే జీవో నెంబర్ 3ను రద్దు చేయడంతో ఉద్యోగ అవకాశాలు కోల్పోయామన్నారు. 1/70 చట్టానికి విరుద్ధంగా గిరిజన ప్రాంతంలో విచ్చలవిడిగా గిరిజనేతరులు పెద్ద పెద్ద భవంతులు కడుతున్నా గిరిజన ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. బోయ, వాల్మీకి, బెంతు, ఒరియాల విషయంలో అసెంబ్లీ చేసిన తీర్మానాన్ని వెనక్కి తీసుకోకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

సుమారు గంటపాటు ఎమ్మెల్యేకు, గిరిజనులకు మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. ఎమ్మెల్యే పొంతనలేని సమాధానం చెప్పి పోలీసులు సహాయంతో అక్కడ నుంచి వెళ్లిపోయారు. రోడ్డుపై బైఠాయింపుతో సుమారు కిలో మీటర్ పొడవున వాహనాలు నిలిచిపోయాయి. గంటపాటు ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు ఈతపల్లి సత్యనారాయణ రెడ్డి, ఈతపల్లి సిరిమల్లె రెడ్డి వికా రాజన్న ధర, వేటుకూరు సర్పంచ్ ఈతపల్లి మల్లీశ్వరి, జేఏసీ నాయకులు కని సన్యాసిరెడ్డి, మట్ల కృష్ణారెడ్డి, ఎంపిటిసి కొరగాని సువర్ణ రాజు, మాజీ ఎంపీటీసీ కణం విజయలక్ష్మి, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు పల్లాల రాజకుమార్ రెడ్డి, దూడ ప్రణీత్, అధిక సంఖ్యలో గిరిజనులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ధనలక్ష్మిని ప్రశ్నిస్తున్న గిరిజన నాయకులు

## స్పందనకు 30 అర్జీలు

ప్రజల సమస్యలు వింటున్న సబ్ కలెక్టర్ శుభం బన్సల్

**ప్రజాశక్తి - రంపచోడవరం**

స్థానిక ఐటిడిఎ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ప్రజలు 30 అర్జీలు సమర్పించారు. వీటిని రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభం బన్సల్ స్వీకరించి వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులను ఆదేశించారు. వై.రామవరం మండలం కానీవాడ పంచాయతీ పరిధి జాజివలస గ్రామంలో ఐటీడీఏ ద్వారా ఏర్పాటు చేసిన చేపల చెరువుల మధ్యలో రాళ్లు తొలగించాలని, పంట కాలువలకు బోధలు ఏర్పాటు చేయాలని, అడ్డతీగల మండలం కోనలవ గ్రామంలో ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలు పొందిన 40 మంది గిరిజనులు, ఆ భూముల్లో వ్యవసాయం చేసుకోవడానికి చెట్టు నరుకుతుంటే ఫారెస్టు అధికారులు అడ్డుకుంటున్నారని, ఆ సమస్యను పరిష్కరించాలని, రంపచోడవరం మండలం కొత్త పాకలు గ్రామానికి చెందిన భూపతిపాలెం ప్రాజెక్టు ముంపు బాధితులు 30 కుటుంబాలకు 2004 నిబంధనల ప్రకారం 60 ఎకరాల భూమి ఏర్పాటు చేయాలని వినతిపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమశాఖ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ డిఎస్.శాస్త్రి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు జి.డేవిడ్ రాజ్, ఎమ్‌డి యూసఫ్, నాగేశ్వరరావు, ప్రాజెక్ట్ ఆర్టికల్చర్ అధికారి రాంబాబు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మండలంలో ఫుడ్ కమిషన్ చైర్మన్ పర్యటన

**ప్రజాశక్తి- విఆర్.పురం**

విఆర్ పురం మండలంలో ఎపి ఫుడ్ కమిషన్ చైర్మన్ సిహెచ్.విజయ ప్రతాప్ రెడ్డి సోమవారం పర్యటించారు. రేఖపల్లి కెజిబివి, రాజపేట ఎడబ్ల్యుసి, గొమ్ము గ్రామంలో మండల పరిషత్ పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలు, రేషన్ షాపులను ఆయన పరిశీలించారు. అంగన్వాడీ కేంద్రాల్లో గర్భిణులకు జరిగిన సీమంతం వేడుకలను చూశారు. విద్యార్థులకు పెడుతున్న ఆహార నాణ్యతను పరిశీలించారు. అక్కడున్న స్టాకును పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు అందించే ఆహార నాణ్యత విషయంలో రాజీ పడవద్దన్నారు. ఆయన వెంట స్థానిక తహశీల్దారు శ్రీధర్, ఏవో ఎం.రత్నకుమారి, ఏపీ ఫుడ్ కమిషన్ సిబ్బంది, అంగన్వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

## గతంలో కేటాయించిన ఇళ్లనే ఇవ్వాలి

### తాడ్వాయి నిర్వాసిత కాలనీ వద్ద బాధితుల ఆందోళన

**ప్రజాశక్తి- విఆర్.పురం**

మండలంలోని శ్రీరామగిరి గ్రామానికి చెందిన పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం మండలం తాడ్వాయి గ్రామంలో నిర్మిస్తున్న నిర్వాసిత కాలనీల్లో 2022లో కేటాయించిన ఇళ్లనే తమకు ఇవ్వాలని బాధిత నిర్వాసితులు డిమాండ్ చేశారు. తావ్వాయి నిర్వాసిత కాలనీలో తమకు కేటాయించిన ఇళ్లను చూసేందుకు సోమవారం బాధిత నిర్వాసితులు వెళ్లారు. అయితే 2022లో వారికి కేటాయించిన ఇళ్లను కాకుండా వేరే ఇళ్లను అధికారులు చూపించడంతో వారంతా అవాక్కయ్యారు. గతంలో తమకు కేటాయించి, చూపించిన ఇళ్లు వేరని, ఇప్పుడు చూపిస్తున్న ఇళ్లు వేరుగా ఉన్నాయని ఆవేదన బాధిత నిర్వాసితులు వ్యక్తం చేశారు. ఈ విషయంపై జంగారెడ్డిగూడెం తహశీల్దారును వివరణ కోరగా, విఆర్.పురం తహశీల్దారు శ్రీధర్‌ను అడగండి అని, వారు చెప్పినదే తాము చేశామని బదులిచ్చారు. దీంతో బాధిత నిర్వాసితులంతా ఆ కాలనీ వద్దే నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2022లో తమకు కేటాయించిన ఇంటి నెంబర్లు, ఇళ్లను ఇవ్వాలని డిమాండ్ చేశారు. పోలవరం ప్రాజెక్టు వల్ల తాము చాలా నష్టపోయామని, ఇంత త్యాగం చేసిన తమను ప్రభుత్వం, అధికారులు మోసం చేయడం దారుణమన్నారు. ప్రభుత్వానికి నిర్వాసితులంటే చులకనగా ఉందని, ఇంకెంతకాలం మోసం చేస్తుందని ప్రశ్నించారు. తమ నిర్వాసిత కాలనీల వద్ద ఉపాధి కల్పించడానికి కంపెనీలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కె.సత్యనారాయణ, బాబూరావు, శివ, అధిక సంఖ్యలో బాధిత నిర్వాసితులు పాల్గొన్నారు.

తాడ్వాయి కాలనీ వద్ద నిరసన తెలుపుతున్న నిర్వాసితులు

## సహజ ఎరువులపై అవగాహన

**ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్:** సెంచురియన్ యూనివర్సి టీకి చెందిన అగ్రికల్చరల్ బీఎస్సీ నాలుగవ సంవత్సరం విద్యార్థులు మండలంలో వేములపూడి రైతులకు సహజ సిద్ధమైన ఎరువులు వాడకంపై అవగాహన కల్పించారు. జీవామృతం, పంచగవ్య ఉపయోగాలని వివరించారు. సేంద్రియ ఎరువులు భూమిని ఏ విధంగా పాడుచేస్తాయో తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు హర్షిత, ఎం.సత్య శ్రీ పాల్గొన్నారు.

## నియామక పత్రాల అందజేత

**ప్రజాశక్తి -ఎస్.రాయవరం:** తహశీల్దార్ కార్యాలయంలో రీ సర్వే డి.టి నారాయణరావు చేతుల మీదుగా సోమవారం యూఎఫ్ ఆర్‌టిఐ నూతన కార్యవర్గంకు నియామక పత్రాలను అందజేశారు. అనకాపల్లి జిల్లా కన్వీనర్ బి.వి.వి సత్యనారాయణ ముఖ్య సలహా దారులు దండు గణపతి రాజు ఆధ్వర్యంలో ఈ పత్రాలు అందజేశారు. ఎస్.రాయవరం మండల కన్వీనర్ మైలపల్లి సత్తిరాజు, కో కన్వీనర్‌గా వాకపల్లి గోవిందమ్మ ,కో కన్వీనర్‌గా గొలుసు శివలతో పాటు కమిటీ సభ్యులకు ఈ నియామక పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ మెంబర్ కోడ బంగారాజు, నక్కపల్లి మండల కన్వీనర్ పొలినాటి వీరబాబు, కోన బాబూరావు, సేనాపతి లోవరాజు, కోసూరు చిరంజీవి, తోట రాజు తదితరులు పాల్గొన్నారు.

## దరఖాస్తుల స్వీకరణ

**ప్రజాశక్తి-రావికమతం:** రావికమతం ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్వాడీ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని రావికమతం ఐసిడిఎస్ ప్రాజెక్టు అసిస్టెంట్ సిడిపిఓ పుష్ప దేవి తెలిపారు. ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో రోలుగుంట మండలం గుర్రంపేట అంగన్వాడీ కేంద్ర కార్యకర్త, రావికమతం నాలుగు అంగన్వాడీ కేంద్ర సహాయకురాలు, బుచ్చయ్యపేట మండలం బుచ్చయ్యపేట ఒకటి అంగన్వాడి కేంద్ర సహాయకురాలు, రాజుపాలెం అంగన్వాడి కేంద్ర సహాయకురాలు, చోడవరం మండలం అంబేరుపురం సహాయకురాలి పోస్టులు ఖాళీ అయ్యాయన్నారు. ఈ పోస్టులకు సంబంధించి అర్హతలు, రిజర్వేషన్ ఇతర వివరాలకు ప్రాజెక్టు కార్యాలయంలో స్వయంగా వచ్చి తెలుసుకోవచ్చని ఆమె తెలిపారు. ఈ నెల 17లోపు దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు.

## ఉపాధి హామీ కూలీల నిరసన

**ప్రజాశక్తి-ఎస్.రాయవరం:** సమస్యలను పరిష్కరించాలని మండలంలో పెట్టుగొల్లపల్లి గ్రామంలో సోమవారం మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ కూలీలు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎం సత్యనారాయణ మాట్లాడుతూ, రోజు వారీ కూలి రూ.600 ఇచ్చి 200 రోజుల పని దినములు కల్పించాలని డిమాండ్ చేశారు. నీడ, మంచినీటి సౌకర్యం కల్పించాలన్నారు.

## మూడు బోర్లు ఏర్పాటు

**ప్రజాశక్తి-రోలుగుంట:** కొవ్వూరు గ్రామ పంచాయతీ పరిధి కొట్టే రవాణా పాకల వద్ద ప్రభుత్వం మంజూరు చేసిన మూడు బోర్లను వేరు వేరు చోట్ల ఎంపిపి యర్రంశెట్టి శ్రీనివాసరావు ప్రారంభించారు. రైతుల కష్టాన్ని గుర్తించి ఈ పాకల దగ్గర బోర్లు వేయడంతో రైతులు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కాంతమ్మ, కన్వీనర్ వై.బాబురావు, ఉపసర్పంచ్ కనరెడ్డి అప్పలనాయుడు, చందక నూకరాజు, వైయస్సార్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## 'విరామ బైబిల్' పోస్టర్ విడుదల

**ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:** స్థానిక సిబీఎం కాంపౌండ్ వద్ద సెంటినరీ బాప్టిస్ట్ చర్చ్ వద్ద విరామ బైబిల్ పాఠశాల పోస్టర్‌ను విడుదల చేశారు. కరోనా కారణంగా గత రెండు సంవత్సరాలుగా నిర్వహించలేదని విబిఎస్ డైరెక్టర్ ఎన్.వయోల లిలియన్ తెలిపారు. మే 1, 2, 3, 4 తేదీలలో ప్రతిరోజు ఉదయం ఎనిమిది గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు విరామ బైబిల్ పాఠశాల తరగతులు నిర్వహిస్తామని తెలిపారు. పిల్లలకు మధ్యాహ్నం ఉచిత భోజనం. స్నాక్స్ వంటివి ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పిల్లలకు వ్యక్తిత్వ వికాసం తో పాటు చక్కని పాటలు, కథలు, యాక్షన్ సాంగ్స్ వంటి వాటిని నేర్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో చర్చి ఉపాధ్యక్షులు గిరిజల్డ్, పాస్టర్ పి .జయరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## బాధితునికి ఆర్థిక సాయం

**ప్రజాశక్తి -రావికమతం:** రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ జన సైనికుడుకు మండల పార్టీ రూ.45 వేల ఆర్థిక సాయం అందజేసింది. మండలంలో టీ.అర్జాపురం గ్రామానికి చెందిన గల్లా సాయికుమార్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. కుటుంబానికి ఇతనే జీవనాధారం కావడంతో విషయం తెలుసుకున్న మండలంలో వివిధ గ్రామాలకు చెందిన జనసైనికులు రూ. 45వేలను సోమవారం చోడవరం నియోజవర్గ ఇన్చార్జ్ పి వి ఎస్ ఎన్ రాజు ఆధ్వర్యంలో భాదితుడు కు అందజేశారు.

# భూసేకరణ చట్టం ప్రకారం ప్యాకేజీ ఇవ్వాలి

### స్పందనలో జెసికి రైతుల వినతి

**ప్రజాశక్తి- నక్కపల్లి:** వైజాగ్ -చెన్నై ఇండస్ట్రీల్ కారిడార్ లో ఏర్పాటు చేస్తున్న పరిశ్రమల కొరకు రోడ్డు వేసేందుకు సేకరిస్తున్న భూములకు న్యాయపరమైన నష్టపరిహారం చెల్లించాలని కోరుతూ రైతులతో కలిసి సోమవారం స్పందనలో అనకాపల్లిలో జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి కు వినతిపత్రం అందజేసినట్లు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలరాజు స్థానిక విలేకరులకు తెలిపారు. మండలంలోని న్యాయంపూడి, కాగిత, వేంపాడు రెవెన్యూ పరిధిలో న్యాయంపూడి, కాగిత, పాటిమీద గ్రామాల భూములు సేకరించి 150 అడుగుల వెడల్పుతో రోడ్డు వేయడానికి ఏపీఐఐసీ అధికారులు భూములు సేకరించడానికి ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిపారు. భూసేకరణ కారణంగా తరతరాల జీవనోపాధిని తామంతా శాశ్వతంగా కోల్పోతున్నామని, వాస్తవానికి భూములు ఇవ్వడానికి ఇష్టం లేదని, అయితే ఈ ప్రాంతం అభివృద్ధి చెందాలని, ఇక్కడ పరిశ్రమలు ఏర్పాటు చేయాలన్న ఉద్దేశంతో జీవనోపాధిని, మా బ్రతుకును త్యాగం చేసి భూములు ఇచ్చేందుకు సిద్ధపడినట్లు రైతులు జెసి దృష్టికి తీసుకువెళ్లారు. అధికారులు ఏ మాత్రం తమ త్యాగాలు గుర్తించకుండా, ప్రస్తుతం భూములకు ఉన్న విలువకు తగ్గట్టుగా నష్టపరిహారం చెల్లించకుండా తీవ్ర అన్యాయం చేస్తున్నారని జేసీ ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు.

రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలరాజు, అమలాపురం గ్రామ సర్పంచ్ శంకరరావు, రైతులు మాట్లాడుతూ, వైజాగ్-చెనై ఇండస్ట్రీల కొరకు నక్కపల్లి మండలంలో రాజయ్యపేట నుండి దోనివాని లక్ష్మీ పురం వరకూ 5 రెవెన్యూ గ్రామాలలో 5,500 ఎకరాలు సేకరించి ఒకే విధంగా నష్టపరిహారం చెల్లించారని, ఆ విధంగానే 3 రెవెన్యూ గ్రామాలలో రోడ్డు వేసేందుకు సేకరించిన భూములు కూడా ఒకే విధంగా పరిహారం చెల్లించాలని కోరారు. భూములు కోల్పోయిన ప్రతీ కుటుంబంలో 18 సంవత్సరాలు నిండిన ప్రతీ ఒక్కరికీ ఆర్ కార్డు లు ఇచ్చి , ఇక్కడ ఏర్పాటు చేసే పరిశ్రమల్లో శాశ్వత ప్రాతిపదికన ఉద్యోగాలు ఇవ్వాలని కోరారు. చెట్లు, నిర్మాణాలు కోల్పోతున్న వీరికి జీవో 268 ప్రకారం నష్టపరిహారం చెల్లించాలని, 2013 భూసేకరణ ప్రకారం ప్యాకేజీలు ఇవ్వాలని కోరారు. భూ సేకరణకు నియమింపబడిన ప్రత్యేక ఉప కలెక్టర్ రైతులను బెదిరించే ధోరణిలో మాట్లాడుతున్నారని, పద్ధతి మార్చుకునే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. సమస్య పరిష్కరించే వరకు భూములు జోలికి అధికారులు రావద్దన్నారు. ఈ కార్యక్రమంలో రావి చిన్ని, రోకల శ్రీను, పెంటకోట నర్సింగరావు, నాగనబోయిన ఈశ్వరరావు పాల్గొన్నారు.

# 493వ రోజుకు మత్స్యకారుల ధర్నా

**ప్రజాశక్తి -నక్కపల్లి :** హెటిరో పైప్ లైన్ అనుమతులు రద్దు చేయాలని మత్స్యకారులు డిమాండ్ చేశారు. హెటిరో మందుల కంపెనీ కొత్తగా వేస్తున్న పైపులైన్ కు వ్యతిరేకంగా మత్స్యకారులు తలపెట్టిన శాంతియుత మహా ధర్నా 493వ రోజుకు చేరింది. సోమవారం శిబిరం వద్ద మత్స్యకారులు పైప్ లైన్ అనుమతులు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. పలువురు మత్స్యకారులు మాట్లాడుతూ, పైపులైన్‌కు వ్యతిరేకంగా తామంతా 493 రోజుల నుండి శాంతియుతంగా ఆందోళన చేస్తున్నప్పటికీ, ఇవేమీ పట్టించుకోకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పైప్ లైన్ కు ఎలా అనుమతులు ఇస్తారని ప్రశ్నించారు. న్యాయం జరిగే వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మత్స్యకారులు పిక్కి రమణ, కోడా కాశీరావు, కోత్వాల కాశీ, పిక్కి కాశీ, ఆర్జిల్లి సింహాద్రి, కారే రాజారావు, చొడిపల్లి రాజు, మోస వెంకటేష్, మైలపల్లి శివాజీ, పిక్కి కోటి, మైలపల్లి బాపూజీ, మైలపల్లి జాను, మైలపల్లి బైరాగి రాజు తదితరులు పాల్గొన్నారు.

## 'రైతు' భరోసా నమోదు

**ప్రజాశక్తి-రావికమతం:** గ్రామపంచాయతీలో భూమి కలిగిన ప్రతి రైతు రైతు భరోసా పథకాన్ని పొందాలని కవగుంట సర్పంచ్ దాసరి సూర్యకుమారి వరహాలు తెలిపారు. మండలం కవగుంట గ్రామంలో సోమవారం సర్పంచ్ ఆధ్వర్యంలో రైతు భరోసా నమోదు సోమవారం చేపట్టారు. కొమిర సచివాలయ రైతు భరోసా ఇన్చార్జ్ శరత్ కుమార్ రైతులకు బయోమెట్రిక్ చేశారు. సర్పంచ్ మాట్లాడుతూ, నాలుగు రోజులుగా రైతు భరోసా పథకం పొందలేని వారిని సర్వే ద్వారా గుర్తించడం జరిగిందన్నారు. సంక్షేమ పథకాలు అర్హత కలిగి ప్రతి ఒక్కరికి అందించడమే ధ్యేయంగా పని చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మహేష్, చేపూరి శేషు, వార్డు మెంబర్ ప్రగడ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# కల్యాణ మండపం నిర్మాణానికి శంకుస్థాపన

**ప్రజాశక్తి-మాడుగుల:** మండల కేంద్రంలోని మోదమాంబ కాలనీలో రూ.30 లక్షలతో నిర్మించనున్న కళ్యాణ మండపానికి సోమవారం శంకుస్థాపన నిర్వహించారు. ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు ఆదేశాల మేరకు అనకాపల్లి ఎంపీ భీశెట్టి సత్యవతి నిధుల ద్వారా కళ్యాణ మండపం నిర్మించనున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీపీ పెదబాబు మాట్లాడుతూ, సుమారు కోటి రూపాయలతో గ్రామ శివారులోని కాలనీలలో రహదారులు, కాలువల నిర్మాణాలు జరుగుతున్నాయని, వీటితోపాటు పెద్ద సంఖ్యలో అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కళావతి, వైస్ సర్పంచ్ శ్రీనాధు శ్రీనివాసరావు, వరహాలు, మహేశ్వరి పాల్గొన్నారు.

## కంటి వైద్య పరీక్షలు

**ప్రజాశక్తి -ఎస్.రాయవరం:** మండల కేంద్రంలోని సచివాలయలో సోమవారం వైయస్సార్ కంటి వెలుగును డాక్టర్ వెంకటరావు నిర్వహించారు. స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, 134 మందికి కంటి వైద్య పరీక్షలు చేయగా వీరిలో 33 మందిని ఆపరేషన్‌కు గుర్తించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం నూకరత్నం, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

## లారీ, బైక్ ఢీ : వ్యక్తి మృతి

**ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్:** మున్సిపాలిటీలో సుబ్బారాయుడుపాలెం వద్ద సోమవారం రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందగా మరో ఇద్దరికి తీవ్ర గాయాలు అయ్యాయి. ఎదురెదురుగా వస్తున్న లారీ, బైకు ఢీకొన్న ప్రమాదంలో బైక్‌పై వెళుతున్న ఓ వ్యక్తి మృతి చెందగా ఇద్దరికి తీవ్ర గాయాలు అయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు ఘటనా స్థలానికి పోలీసులు చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతి చెందిన వ్యక్తి చింతపల్లికి చెందిన కంచే గణపతి ( 22) గా పోలీసులు గుర్తించారు. క్షతగాత్రులను నర్సీపట్నం ఏరియా హాస్పిటల్‌కి తరలించారు.

## 'గంభీరం'లో బీటెక్ విద్యార్థి గల్లంతు

**ప్రజాశక్తి -ఆనందపురం** : ఆనందపురం మండలం గంభీరం రిజర్వాయర్‌లో సోమవారం మధ్యాహ్నం గీతం యూనివర్సిటీ బీటెక్ విద్యార్థి గల్లంతయ్యాడు. పోలీసుల కథనం ప్రకారం.. గీతం యూనివర్సిటీలో కప్యూటర్స్ సైన్స్ నాలుగో సంవత్సరం చదువుతున్న 10 మంది అబ్బాయిలు, ఐదుగురు అమ్మాయిలు సోమవారం మధ్యాహ్నం 3:00 గంటలకు గంభీరం రిజర్వాయర్‌కు వచ్చారు. రిజర్వాయర్ పక్కన ఆడుకుంటుండగా బంతి రిజర్వాయరులో పడింది. బంతిని తీయడానికి నెల్లూరి తరుణ్ కుమార్ రిజర్వాయర్‌లో దిగాడు. ఈత రాకపోవడంతో మునిగిపోయాడు. స్నేహితులు స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు, గంభీరం గ్రామస్తులు గాలింపు చేపట్టినా తరుణ ఆచూకీ కానరాలేదు. గోపాలపట్నం రాములు వీధికి చెందిన తరుణ్ కుమార్ తండ్రి శివప్రసాదరావు ఫిర్యాదు మేరకు ఆనందపురం సిఐ రామచంద్రరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## రేషన్ బియ్యం పట్టివేత

**ప్రజాశక్తి - ఆరిలోవ :** ఆటోలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని ఆరిలోవ పోలీసులు పట్టుకున్నారు. ఆదివారం రాత్రి హనుమంతువాక కూడలిలో డ్రంక్ అండ్ డ్రైవ్‌లో భాగంగా వాహనదారులను తనిఖీ చేస్తుండగా నగరం నుంచి పెదగదిలివైపు వస్తున్న ఆటోను ఆపారు. ఆటో డ్రైవర్ మద్యం తాగి ఉండటంతోపాటు ఆటోలో సుమారు టన్ను రేషన్ బియ్యం ఉండడం గమనించారు. అనుమానం వచ్చి రేషన్ బియ్యంతో ఉన్న ఆటోను ఆరిలోవ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. రేషన్ బియ్యం గొడౌన్ నుంచి వచ్చిన గోనె సంచులతో ఉండడం విశేషం. ఆరిలోవ పోలీసులు రేషన్ బియ్యం ఎక్కడ నుంచి ఎక్కడకు తరలిస్తున్నారన్న వివరాలను సేకరిస్తున్నారు.

## కుక్క దాడిలో బాలునికి తీవ్ర గాయాలు

**ప్రజాశక్తి -తగరపువలస :** కుక్క దాడిలో ఓ బాలునికి తీవ్ర గాయాలైన సంఘటన జివిఎంసి రెండో వార్డు పరిధి అల్లూరి సీతారామరాజు కాలనీలో చోటు చేసుకుంది. బాధితుని తండ్రి భీమిలి పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమ ఇంటి ముంగిట ఆడుకుంటున్న ఆరేళ్ల కుమారుడు కొయ్యాన తన్వీర్‌పై ఇంటి పక్కనే ఉంటున్న యజమాని పెంపుడు కుక్క దాడి చేసి గాయపరిచినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. పెంపుడు కుక్క యజమానికి గతంలో చెప్పినా సరే పట్టించుకోలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు.

## కోడి పందేల శిబిరంపై దాడి

**ప్రజాశక్తి -రావికమతం:** కొత్తకోట పోలీసు స్టేషన్ పరిధిలో కోడి పందేల శిబిరం పై దాడి చేసి 5గురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.620తో పాటు 5కోళ్లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు కొత్తకోట ఎస్ఐ విభీషణరావు తెలిపారు. స్టేషన్ పరిధిలో కొంజూర్తి గిరిజన గ్రామంలో కోడిపందాలు ఆడుతున్నట్లు సమాచారం రావడంతో సిబ్బందితో దాడి చేశామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## పోషకాహార కిట్లు పంపిణీ

**ప్రజాశక్తి-గొలుగొండ:** మండలంలోని సిహెచ్ నాగాపురం అంగన్వాడీ సెంటర్‌లో గర్భిణీలకు, బాలింతలకు వైయస్సార్ పోషకాహార కిట్లను సోమవారం సర్పంచ్ యలమంచిలి రఘురామ్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణీలు, బాలింతలకు పౌష్టికాహారం తీసుకోవడంపై అంగన్వాడీ కార్యకర్తలు పూర్తి అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్త లక్ష్మి, ఆయా రమణమ్మ, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

పరీక్షా కేంద్రం వద్ద పహారా కాస్తున్న భద్రతా సిబ్బంది

## కట్టుదిట్టమైన భద్రత నడుమ టెన్త్ పరీక్షలు

**ప్రజాశక్తి - సీలేరు :** జీకే వీధి మండలం సీలేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరతగి పరీక్షలు కట్టుదిట్టమైన భద్రత నడుమ జరుగుతున్నాయని చీఫ్ సూపరింటెండెంట్ సింహాచలం వెల్లడించారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఎటువంటి మాస్ కాపీయింగ్ జరక్కుండా చర్యలు చేపట్టేమన్నారు. విద్యార్థులకు పరీక్ష సమయంలో ఎటువంటి సమస్యలు తలెత్తకుండా విద్యుత్తు, మంచినీరు తదితర సౌకర్యాలు పూర్తిస్థాయిలో కల్పించామని తెలిపారు. పరీక్షలు పూర్తయ్యే వరకు పరీక్ష కేంద్రం పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్ అమల్లో ఉంటుందని ఎస్సై రామకృష్ణ వెల్లడించారు. పరీక్ష కేంద్రం చుట్టుపక్కల ఇతరులు వాహనాలు నడపడం నిషేధమన్నారు.

## 14 నుంచి సిపిఐ పాదయాత్ర

**ప్రజాశక్తి-కొయ్యూరు :** హైడ్రో పవర్ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా, ఇతర ప్రజా సమస్యలపై ఈ నెల 14నుండి ఏజెన్సీ వ్యాప్తంగా పాదయాత్ర చేపడుతున్నట్లు సిపిఐ నాయకులు సత్యనారాయణ తెలిపారు. సిపిఐ కొయ్యూరు మండలం కార్యవర్గ సమావేశం సోమవారం కెడి.పేట అల్లూరి పార్కులో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా ఆయనకు నివాళులర్పించి మంప గ్రామం నుండి కేడీపేట అల్లూరి పార్కు మీదుగా ఏజెన్సీ మొత్తం పాదయాత్ర చేస్తున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో సిపిఐ మండల కార్యదర్శి ఇరవాడ దేవుడు, సహాయక కార్యదర్శి పొట్టిక మల్లేష్, కార్యవర్గ సభ్యులు వి.నానాజీ, గుమ్మ రాంబాబు, మొల్ల నాగరాజు, ఇరవాడ రాజబాబు, రావణాపల్లి ఎంపీటీసీ ఇరవాడ సత్యవాణి, మొల్ల దేవమణి, సుర్ల వరలక్ష్మి, పోటుకూరి దార మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## అన్ని పోటీ పరీక్షలకూ సమ్మర్ కామన్ కోచింగ్

**ప్రజాశక్తి - కలెక్టరేట్ :** అన్ని ప్రభుత్వ ఉద్యోగాలకు, విద్యాలయాల ప్రవేశాలకు ఉపయోగపడేలా సమ్మర్ కామన్ కోచింగ్ ప్రారంభించబోతున్నట్లు అల్లూరి స్టడీ సర్కిల్ నిర్వాహకులు కె.అభిమన్యు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. రెండు నెలల పాటు నిర్వహించే ఈ తరగతులు వేసవి సెలవులలో యువత సమయాన్ని వృథా కాకుండా సద్వినియోగ పరుస్తాయన్నారు. శిక్షణ వారి అభివృద్ధికి దోహదం చేసేలా ఉంటుందన్నారు. విద్యాలయాల ప్రవేశ పరీక్షలలోనూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలకు కామన్‌గా ఉండే ఇంగ్లీష్ లాంగ్వేజ్, అర్థమెటిక్, రీజనింగ్, జికె, కరెంట్ అఫైర్స్ సబ్జెక్టులను బోధిస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరింత సమాచారం కోసం డాబాగార్డెన్స్‌లోని అల్లూరి స్టడీ సర్కిల్ కార్యాలయాన్ని లేదా 8008412798 ఫోన్ నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

## డిఎస్‌సి నోటిఫికేషన్ తక్షణం విడుదల చేయాలి

**ప్రజాశక్తి - కలెక్టరేట్ :** డిఎస్‌సి నోటిఫికేషన్ తక్షణమే విడుదల చేయాలని డివైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు యుఎస్ఎన్.రాజు డిమాండ్ చేశారు. సోమవారం స్పందనలో ఆయన ఆధ్వర్యంలో సంఘం నేతలు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజు మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నాలుగు సంవత్సరాల నుంచి డిఎస్‌సి ఇవ్వకుండా నిరుద్యోగులను మోసం చేస్తోందన్నారు. రాష్ట్రంలో టిటిసి, బిఇడి చేసిన అభ్యర్థులు లక్షల మంది డిఎస్‌సి నోటిఫికేషన్ కోసం ఎదురుచూస్తున్నారని, రాష్ట్ర ప్రభుత్వం మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని విమర్శించారు. యువతకు ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలు మరిచి నిరుద్యోగులను నట్టేట్లో ముంచి వారి ఆత్మహత్యలకు కారణమవుతోందని తెలిపారు

# కోవిడ్‌ను ఎదుర్కొనేందుకు విమ్స్ సిద్ధం

**వంద పడకలు ఏర్పాటు**

**సాధారణ రోగులకు ఇబ్బందులు లేకుండా జ్వరాలకు ప్రత్యేక బ్లాక్**

**కోవిడ్ ఏర్పాట్లపై మాక్ డ్రిల్**

కోవిడ్ నేపథ్యంలో ఏర్పాటు చేసిన పడకలను పరిశీలిస్తున్న విమ్స్ డైరెక్టర్ రాంబాబు

**ప్రజాశక్తి - అరిలోవ :** కోవిడ్ ఎక్స్‌బిబి 1.16 దేశంలో ప్రభావం చూపే అవకాశాలు ఉన్నట్లు నిపుణులు హెచ్చరిస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం అప్రమత్తమైంది. ఈ క్రమంలోనే కోవిడ్‌ను ఎదుర్కొనేందుకు జిల్లాల్లోని ఆస్పత్రులను అధికారులు సిద్ధం చేస్తున్నారు. అందులో భాగంగా మొదటి, రెండో వేవ్‌లలో డెడికేటెడ్ కోవిడ్ ఆసుపత్రిగా నిలిచిన విమ్స్‌ను 100 పడకలతో ఇప్పటికే సిద్ధం చేశారు. అందుకు సంబంధించిన మాక్ డ్రిల్‌ను విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోవిడ్‌ను విజయవంతంగా ఎదుర్కొనేందుకు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. అందులో భాగంగా కోవిడ్ రోగులకు అందించాల్సిన మందులు, ఆక్సిజన్ సరఫరాకు ఎటువంటి ఆటంకమూ కలగకుండా ముందస్తు ఏర్పాట్లు చేసుకుంటున్నామన్నారు. ప్రస్తుతం వంద పడకలను కేటాయించామని, అవసరం బట్టి వాటి సంఖ్యను 600 పడకలకు పెంచుతామని తెలిపారు. ప్రతి పడకకూ ఆక్సిజన్ సదుపాయం ఏర్పాటు చేశామన్నారు. 200 ఐసియు పడకలను అందుబాటులోకి తీసుకునిరాగల సామర్థ్యం విమ్స్ ఆస్పత్రికి ఉందన్నారు. విమ్స్‌లో అందుబాటులో ఉన్న రెండు ఆక్సిజన్ ట్యాంకులు, రెండు ఆక్సిజన్ ప్లాంట్లును పరిశీలించామన్నారు. విమ్స్ ప్రస్తుతం సాధారణ రోగులకు ఉత్తమ వైద్యం అందించడంలో నిమగ్నమై ఉన్నందున.. వారికి ఎటువంటి ఇబ్బందీ లేకుండా ఉండేందుకు కోవిడ్ లక్షణాలు ఉన్నవారికి ప్రత్యేకంగా ఫీవర్ ఒపిని ఏర్పాటు చేశామన్నారు. అక్కడే రోగులకు పరీక్షించి కరోనా పాజిటివ్ అయితే కోవిడ్ వార్డుకు, సాధారణ జ్వరం అయితే సాధారణ వార్డుకు తరలిస్తామన్నారు.

**జి 20 అభివృద్ధి పనుల్లో..**

# అవినీతి, అక్రమాలపై విచారణ చేపట్టాలి

**ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ :** జి 20 సన్నాహక సదస్సు సందర్భంగా జివిఎంసి చేపట్టిన వివిధ రకాల అభివృద్ధి పనుల్లో జరిగిన భారీ అవినీతి, అక్రమాలపై జివిఎంసి ఫ్లోర్ లీడర్లు లేదా హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని కోరుతూ జివిఎంసి 78వ వార్డు కార్పొరేటర్, సిపిఎం ఫ్లోర్ లీడర్ డాక్టర్ బి.గంగారావు నగర మేయర్ హరి వెంకట కుమారికి సోమవారం ఉదయం 'స్పందన'లో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖలో గత నెల 28 నుంచి 30 వరకు జరిగిన జి 20 దేశాల సన్నాహక సదస్సు సందర్భంగా జివిఎంసి సుమారు రూ.160 కోట్ల విలువగల అనేక రకాల అభివృద్ధి పనులు చేపట్టిందని, వాస్తవంగా ఈ సదస్సు నిర్వహణ బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలదని పేర్కొన్నారు. అయినప్పటికీ ప్రజలు కట్టే పన్నుల ద్వారా వచ్చిన సొమ్ములో సుమారు రు115.71 కోట్లు, విఎంఆర్‌డిఎ, ఎపి గ్రీన్ బిల్డింగ్ కార్పొరేషన్, ఆర్ అండ్ బి, జాతీయ రహదారుల సంస్థల ద్వారా సమకూరిన మరో రూ.45 కోట్లు ఖర్చు చేసినట్లు ఈ నెల 7న జరిగిన సమయంలో మేయర్ తెలియజేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ సందర్భంగా వివిధ పనులకు చేసిన ఖర్చులను తెలియపరిచారన్నారు. ఈ పనులను సిపిఎం స్వయంగా పరిశీలించిందని, భారీగా అవినీతి, అక్రమాలు జరిగాయని తాము గుర్తించామని తెలిపారు. పనులన్నీ నాసిరకంగానూ, ప్రజా నిరుపయోగంగానూ వున్నాయని పేర్కొన్నారు. వాస్తవ విలువ కన్నా 300 నుంచి 500 శాతం అధికంగా చూపి పెద్దయెత్తున ప్రజాధనాన్ని లూటీ చేసినట్లు స్పష్టమవుతోందన్నారు. జివిఎంసి కౌన్సిల్ ఆమోదానికి పెట్టకుండా పనులను చట్ట విరుద్ధంగా చిన్నవిగా విడగొట్టడం, టెండర్స్ పిలవకుండా పనులు చేయించడం, ముందస్తు అనుమతుల పేర పనులు చేపట్టడం వంటి చట్ట విరుద్ధ, అక్రమ చర్యలకు పాల్పడినట్లు తెలిపారు. వీటిపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. బిటి రహదారులకు రూ.27.55 కోట్లు, ఫుట్‌ఫాత్ పునరుద్ధరణ, మరమ్మతుల కోసం ఏకంగా రూ.23.40 కోట్లు ఖర్చు చేసినట్టు చూపారని, వేసిన బిటి రహదారులన్నీ తీవ్ర నాణ్యతా లోపంగా ఉన్నాయని తెలిపారు. ఇక ఫుట్‌పాత్ మరమ్మతుల్లో సగానికి సగంపైగా అక్రమాలు, అవినీతి జరిగాయన్నారు. కైలాసగిరి కింద సీతకొండ వ్యూ పాయింట్‌కు రూ.3.29 కోట్లు ఖర్చు చేసినట్టు తెలిపారని, వాస్తవంగా రూ.కోటి కూడా ఖర్చు కాదని అన్నారు. గుడ్లవానిపాలెం, జోడుగుల్లపాలెం, సాగర్ నగర్ బీచ్‌ల వద్దా ఇలానే జరిగిందన్నారు. ఎక్కడెక్కడ ఎంత దుర్వినియోగం జరిగిందో గంగారావు వివరించారు. జి 20 పేర చేసిన వ్యయం పూర్తిగా ప్రజలకు, నగరానికి ఏమాత్రమూ ఉపయోగపడకపోగా పూర్తిగా విశాఖ ప్రజలు వివిధ రకాల పన్నుల పేర చెల్లించిన సొమ్ము కొల్లగొట్టబడిందన్నారు. నాసిరకం పనులపైన, రంగులపైన వచ్చిన విమర్శల నేపథ్యంలో ఆంధ్రా యూనివర్సిటీలోని ఇద్దరి ఆచార్యులతో విచారణ కమిటీని వేసినట్లు తెలిపారు. ఆ కమిటీలో జివిఎంసిలోని మరో ఇద్దరు వున్నట్లు చెప్పారు. కేవలం జరిగిన పనులన్నీ నాణ్యంగా జరిగాయని సర్టిఫికెట్ ఇప్పించుకోవడానికి ముందస్తు ప్రణాళికతో వేసిన కమిటీలా ఇది ఉందని పేర్కొన్నారు. ఎపి గ్రీన్ బిల్డింగ్ కార్పొరేషన్, విఎంఆర్‌డిఎ, జాతీయ రహదారుల సంస్థ, అర్ అండ్ బి సంస్థల నుంచి నిధులు మంజూరైనట్టు తెలిపారని, కానీ ఇప్పటివరకు ఎంత వచ్చింది, ఇంకా ఎంత రావాలో చెప్పలేదని అన్నారు. ప్రభుత్వం నుంచి నిధులు విడుదల చేస్తున్నట్లు జిఒ కూడా లేదన్నారు. కనుక ఈ సంస్థల నిధుల భారం కూడా జివిఎంసి మీదే పడుతుందని ఆయన తన వినతిపత్రంలో పేర్కొన్నారు

రాజవొమ్మంగిలో నిరసన తెలుపుతున్న టిడిపి నేతలు

## విద్యుత్ ఛార్జీల పెంపుపై టిడిపి నిరసన

**ప్రజాశక్తి-రాజవొమ్మంగి**

ప్రభుత్వం పెంచిన విద్యుత్ ఛార్జీలు తక్షణం తగ్గించాలంటూ టిడిపి మండల అధ్యక్షులు, లబ్బర్తి ఎంపిటిసి గొల్లపూడి పెద్దిరాజు ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు సోమవారం స్థానిక విద్యుత్‌శాఖ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు, ఈ సందర్భంగా టిడిపి మండల అధ్యక్ష కార్యదర్శులు జి.పెద్దిరాజు, ఎం.డింబకేశ్వరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి గద్దెనెక్కిన తర్వాత 7 సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచి ప్రజలు నడ్డి విరిచారని విమర్శించారు. చంద్రబాబు ప్రభుత్వం ముందుచూపుతో తీసుకున్న నిర్ణయాల కారణంగా మిగులు విద్యుత్ సాధించి విద్యుత్ కోతలు లేకుండా ఉన్నాయని తెలిపారు. కాని నేడు ప్రజలు విద్యుత్ కష్టాలు ఎదుర్కొంటు నానా అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు గొల్లపూడి రమణి, ముప్పన కేశవ్, పెడిరెడ్ల సత్తిబాబు, జెట్టి మధు, కొపురి రత్నం, కె సావిత్రి, శ్రీను, సత్తిబాబు, నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

**రంపచోడవరం :** మండల కేంద్రంలోని విద్యుత్ సబ్ స్టేషన్ ఎదురుగా టిడిపి మండల అధ్యక్షులు కారం సురేష్ బాబు ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. సబ్ స్టేషన్ గేట్ వద్ద బైఠాయించి పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వం గిరిజనులకు 200 యూనిట్లు వరకు ఉచితంగా విద్యుత్ ఇచ్చినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు అనంత మోహన్, కారం సింహాచలం, సర్పంచ్ వంతల అచ్చియమ్మ, సిద్ధ వెంకన్న దొర, దిండి జనార్ధన్, మడకం పండు దొర, బుడ్డిగ రాజేంద్ర వరప్రసాద్, అంజూరు విజయలక్ష్మి, చక్రపాణి పాల్గొన్నారు.

## అనారోగ్యంతో డిజిటల్ అసిస్టెంట్ మృతి

**ప్రజాశక్తి - రంపచోడవరం :** మండలంలోని సిరిగిందలపాడు గ్రామానికి చెందిన సచివాలయ ఉద్యోగి పాతర సిరి సోమవారం అనారోగ్యంతో మృతి చెందారు. సిరి మండలంలోని తామరపల్లి గ్రామ సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఆమె కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. పరిస్థితి విషమించి సోమవారం మృతి చెందారు. ఎంపిడిఒ కుమార్‌బాబు, రంపచోడవరం సర్పంచ్ మంగ బొజ్జయ్య, చుట్టూ పక్కల ఉన్న సచివాలయాల సిబ్బంది సిరి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు.

## ఆడాకులలో 'జగనన్నే మా భవిష్యత్తు'

**ప్రజాశక్తి-కొయ్యూరు :** మండలంలోని ఆడాకుల గ్రామంలో కొయ్యూరు వైస్ ఎంపిపి అప్పన వెంకటరమణ ఆధ్వర్యాన సోమవారం జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికి వెళ్లి గత టిడిపి ప్రభుత్వానికి, ప్రస్తుత వైసిపి ప్రభుత్వానికి మధ్య ఉన్న వ్యత్యాసాన్ని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అర్హత ఉన్న ప్రతి లబ్ధిదారులకు అందుతున్నాయా? లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అడాకుల సచివాలయ కన్వీనర్లు అప్పన జయంతి, గాడి అచ్చిరాజు, గృహ సారథులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

## 739వ రోజుకు ఉక్కు జెఎసి దీక్షలు

**ప్రజాశక్తి - కలెక్టరేట్ :** విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటుపరం చేయవద్దని, ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని డిమాండ్ చేస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద కార్మిక సంఘాల జెఎసి ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షలు సోమవారం నాటికి 739వ రోజుకు చేరాయి. దీక్షల్లో సిఐటియుఐ మత్స్యకార మహిళలు కూర్చున్నారు. నాయకురాలు కె.లక్ష్మి, ఎం.లక్ష్మి, జి.లక్ష్మి, దేశమ్మ, జి.కొండమ్మ, కె.లక్ష్మి పాల్గొన్నారు.